దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం గ్రామంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు పలు అంశాల అవగాహన కల్పించారు. దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాకాలంలో నీటి నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి నిల్వ ఉన్న చోట్ల దోమలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. చెత్త కుండీలు, చిన్న చిన్న నీటి గుంతల్లో నీటిని తొలగించాలన్నారు. గుండె సంబంధిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. భవిష్యతు తరాలకు నీటి కష్టాలు రాకుండా వాననీటిని సంరక్షించుకోవడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు.

వంద శాతం అక్షరాస్యతే లక్ష్యం

ఎంఈవో శంకర్ రాథోడ్



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో శంకర్ రాథోడ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం ఉదయం విలేజ్ రిసోర్స్ పర్సన్స్‌ల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఒక రోజు నిర్వహించిన ఈ శిక్షణ శిబిరాన్ని రాజేంద్రనగర్ మండల ఎంఈవో శంకర్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ మండలంలో వంద శాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంపై ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రాజు, రవీందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటాం



మంగళసూత్రం, మెట్టెలను అందించిన స్వరూప

మణికొండ: ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పేదలను అన్ని విధాలా ఆదుకుని వారికి అండగా ఉంటామని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూప నగేష్‌యాదవ్ అన్నారు. గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ కూతురు వివాహానికి ఆమె బుధవారం మంగళసూత్రం, మెట్టెలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారికి తమ వంతుగా వివాహాలు, చదువులకు ఆర్థిక సాయాన్ని నిరంతరం అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లోనూ తమ సేవలు నిరంతరాయంగా కొనసాగిస్తామని, సేవలు పొందే వారు తమను సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకు వందకు పైగా పేదలకు తమ వంతు సహకారం అందించామన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలంతా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఓంనగర్ కాలనీలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలల్లో మొక్కలను నాటాలన్నారు. వాటికి క్రమంగా రోజు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు శ్యాములుగౌడ్, నేతలు బాలాజీనాయక్, లక్ష్మణ్, కిరణ్, బాల్‌రాజ్, శేఖర్, వార్డు ఇన్‌చార్జి వెంకటప్ప, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఈసీ వాగులోకి మురుగునీటి పైపులైన్..!

భారీ సైజు పైపులతో అనధికారికంగా పనులు

- గతంలోని వరదనీటి కాలువ మూసివేత
- కవేలిగూడ చౌరస్తాలో కనుమరుగైన కల్వర్టులు

శంషాబాద్ రూరల్: వరద సాఫీగా వెళ్లే దారులను ఇష్టానుసారంగా మూసివేసి.. కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేస్తూ మురుగును ఈసీ వాగులోకి చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మండలంలోని రామంజాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామం కవేలిగూడ చౌరస్తా వద్ద చేపట్టిన పైపులైన్ పనులు వివాదాస్పదం అవుతున్నాయి. గడచిన కొంత కాలంగా కవేలిగూడ చౌరస్తా వద్ద అక్రమ లేఅవుట్లు వెలిశాయి. ఇందులో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు.

- శంషాబాద్–షాబాద్ రహదారిని ఆనుకుని వెలిసిన ఈ వెంచర్లలో రహదారికి పక్కన ఉన్న ప్లాట్ల యజమానులు అక్కడ ఉన్న వరదకాలువను మూసి, కల్వర్టులను మాయం చేశారు. రహదారిలో ఉన్న దీంతో వరదంతా చౌరస్తాలో నిలిచి తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు పనులు పూర్తి కావడంతో..

కవేలిగూడ చౌరస్తా వద్ద సుమారు 600 మీటర్ల దూరం వరకు నాలుగు వరసలుగా ఇటీవల సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ. కోట్లు ఖర్చు చేసి వేసిన రహదారి వద్ద వరదనీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టలేదు. గతంలో ఉన్న రెండు కల్వర్టులను మూసివేసినా.. అధికారులు వాటిని పునః నిర్మాణం చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తుంది.

- ఓ చోట కేవలం రహదారి కింద పైపులైన్ వేసి వదిలేశారు. దీంతో పైభాగం నుంచి వచ్చే వరద ఒకే వైపు నిలిచి దుకాణాల్లోకి చేరుతుంది. ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీరు కుంటను తలపిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వరదంతా రహదారిపైనే నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అనధికారికంగా పనులు..

చౌరస్తా వద్ద ఉన్న దుకాణదారులు, ప్లాట్ల యజమానుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఓ ప్రజాప్రతినిధి అనధికారికంగా పైపులైన్ పనులు చేపట్టారు. కల్వర్టు మూసివేతకు ఇతనే కారణమంటూ ఆరోపణలు ఉన్నాయి.

- పది రోజుల క్రితం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను పిలిపించి మరీ ఈ పనులను ప్రారంభించడం గమనార్హం. వరద నీటితో పాటు సమీపంలో ఉన్న ఇళ్ల మురుగు నీటిని ఈ పైపులైన్ గుండా ఈసీవాగులో కలిపేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.
- గతంలో కల్వర్టు మార్గం గుండా వరదనీరు వెళ్లే ప్రాంతాన్ని మూసి, ఇప్పుడు ఇష్టానుసారంగా పైపులైన్ వేస్తూ వాగునీటిని కలుషితం అయ్యేలా పనులు చేపట్టడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కవేలిగూడ చౌరస్తాలో భారీ వర్షానికి రహదారిలో నిలిచిన నీరు

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు..

కవేలిగూడ చౌరస్తాలో పైపులైన్ ఏర్పాటుకు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. పైగా ఈ పనుల కోసం నిధులు కూడా ఎక్కడి నుంచి తీసుకొచ్చారో మాకు తెలియదు.

– నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, రామంజాపూర్



కవేలిగూడ చౌరస్తాలో అనధికారికంగా చేపట్టిన పైపులైన్ పనులు



శంషాబాద్–షాబాద్ రహదారిలో కవేలిగూడ చౌరస్తా వద్ద గతంలో మూసిఉన్న కల్వర్టు (ఫైల్)

ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వీరబ్రహ్మం

మణికొండ: ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద కలలు కనటంతో పాటు సృజనాత్మకంగా, వినూత్నంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.వీరబ్రహ్మం, ఎవర్ నార్త్ హెల్త్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ నరసింహా, ఐఐటీ హైదరాబాద్ మెకానికల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థులు, వారి తల్లితండ్రులకు ఓరియంటేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్, సెమీ కండక్టర్స్, యాడీటీవ్ మాన్యుఫాక్చరింగ్, 3డీ టెక్నాలజీ వంటి ఆధునిక అభివృద్ధి అంశాలను విద్యార్థులు లోతుగా అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థి జీవితం ఓ ఆసక్తికర అకడమిక్ ప్రయాణమన్నారు. కష్టాలు ఎదుర్కోవటంతోనే విజయాలు సాధ్యం అవుతాయన్నారు. తప్పుల నుంచి నేర్చుకోవటం, ప్రతి అంశాన్ని లోతుగా అర్థం చేసుకున్నపుడే రాణిస్తారన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానాలకు అనుగుణంగా మారటం, సమస్యలు పరిష్కరించటం, విఫలాల నుంచి పునరుద్ధరించుకోవటం చేయాలన్నారు. నిత్యం నేర్చుకోవటం, క్రిటికల్ థింకింగ్, టీమ్ వర్క్, ప్రాక్టికల్ అప్లికేషన్ ప్రాముఖ్యతలను వివరించారు.

గణేశ్ విగ్రహాల తరలింపులో అప్రమత్తంగా ఉండాలి



గణేశుడి విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు



మామిడి కిశోర్, ఎస్‌ఐ

రాజేంద్రనగర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయక విగ్రహాలను మండపాలకు తీసుకొచ్చే నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మామిడి కిశోర్ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... విగ్రహం ఎత్తు, ట్రాలీ, డీసీఎంలలో తీసుకొచ్చే సమయంలో పూర్తి ఎత్తును సరి చూసుకోవాలన్నారు. ఏ దారి గుండా వస్తున్నామో ముందే నిర్ణయించుకొని దారిలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు తదితర వాటిని సరి చూసుకోవాలన్నారు. వాహనం వచ్చే దారిని ముందే పరిశీలించుకోవాలన్నారు. చెట్టు కొమ్మలు, రోడ్లపై గుంతలు తదితర వాటిని సరి చూసుకొని అనంతరం గణేశ్ ప్రతిమను తీసుకురావాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమకు సమాచారం అందించాలన్నారు.

మూసీ పరీవాహక ప్రాంతాల్లో పారాహుషార్

- హిమాయత్‌సాగర్ రెండు గేట్ల ఎత్తివేత
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

బండ్లగూడ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాలు వరద నీటితో నిండుకుండలా మారాయి. హిమాయత్‌సాగర్ నీటి మట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో జలమండలి అధికారులు వరద నీటిని గేట్లను ఎత్తి దిగువ ప్రాంతాలకు పంపిస్తున్నారు. అలాగే బుధవారం ఉస్మాన్‌సాగర్ చెరువు సైతం పూర్తిస్థాయికి చేరుకోవడంతో రెండు గేట్లను ఎత్తి దిగువ ప్రాంతాలకు నీటిని పంపిస్తున్నారు. ఇందులో భాగంగా ఈసీ, మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. హైదర్షాకోట్ ప్రాంతంలోని పలు కాలనీల గూండా పరీవాహక ప్రాంతం ఉండడంతో అధికారులు మైక్స్ ద్వారా ప్రజలకు పలు సూచనలు అందజేశారు. పరీవాహక ప్రాంతాలకు వెళ్లవద్దు అని తెలియజేశారు.



హైదర్షాకోట్‌లో అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

రోడ్లకు మరమ్మతులు చేయండి

బండ్లగూడ: వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్ కోరారు. బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషనర్ కమిషనర్ బి.శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయన్నారు. దీంతో వాహనాదారులు, పాదచారులుత తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. గతంలో శంకస్థాపన చేసిన వివిధ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేతలు దప్పు నవీన్‌కుమార్, అంకం శ్రీనివాస్, భోగాల శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డైరెక్టర్ ప్రేమ్‌కుమార్

డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అగ్ని ప్రమాదం



అత్తాపూర్: ప్రేరణ క్రియేషన్స్ డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు 50 వేల రూపాయల వరకు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని... ఫర్నీచర్ తదితర వస్తువులను ఫైర్ ఇంజన్ సాయంతో కాపాడగలిగినట్లు రాజేంద్రనగర్ ఫైర్ ఆఫీసర్ చంద్రనాయక్ తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల సమయం ప్రాంతంలో అత్తాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్ సమీపంలో ఉన్న కేజీఎస్ ఎంక్లేవ్ మొదటి అంతస్తులో ప్రేరణ క్రియేషన్స్ డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం వచ్చిందన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశామన్నారు. దేవుడి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలో ఉన్న దీపం ప్రతిమ పక్కనే ఉన్న వస్తువులకు తలగడంతో ప్రమాదం జరిగినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకు మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వినాయక్‌నగర్‌లో గాయత్రీ మాత టెంపుల్ ప్రాంతంలోని పరిసర ప్రాంతాలల్లో సీసీ రోడ్డు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు నూతన సీసీ రోడ్ల నిర్మాణం కోసం బుధవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. వీలైనంత త్వరగా సీసీ రోడ్లు పనులకు నూతన ఎస్టిమేషన్లు వేసి పనులు త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే బస్తీ వాసులు తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, లోక్‌నాథ్, నేతలు శశిధర్‌రెడ్డి, మహేందర్, సాయి, షేక్ సవాలి, చిన్నయ్య, తన్వీర్, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివ, తాజుద్దీన్, మహబూబ్ బాషా, సమీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో ఘనంగా శంకు పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామంలోని అతి పురాతనమైన శ్రీశ్రీశ్రీ ఈదమ్మ పోచమ్మ ఆలయంలో బుధవారం శంకు పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల దేవాలయానికి సంబంధించిన శంకు పూజ కార్యక్రమాలను వేద పండితులు రేవల్ల రాజు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి వెసేల్ల గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేత శివానంద్ రెడ్డి, దయానంద్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జయప్రకాశ్, మాజీ కౌన్సిలర్ డేవిడ్ దయానంద్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.బాబురావు, కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు లలిత్ వర్మ, రగడంపల్లి శ్రవణ్, పెండ్యాల శ్రీధర్, రజనీకాంత్ గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం దేవాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యాన పంటలతో సహజ రంగులు

ఉద్యానవన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

ఏజీవర్సిటీ: ఉద్యాన పంటలైన పూలు, పండ్లు, సుగంధ ద్రవ్య పంటలతో సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకోవచ్చని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయం, బోర్డ్ ఆఫ్ రీసర్చ్ ఇన్ న్యూక్లియర్ సైన్స్ మద్దతుతో ఇండియన్ ఉమెన్ సైంటిస్ట్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పర్యావరణ సంస్థలు సంప్రదాయ పద్ధతిలో సహజరంగుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ రాజిరెడ్డి మాట్లాడుతూ... సహజ రంగులను వస్త్రాయల తయారీలో భాగంగా వస్త్ర, ముద్రణ, సౌందర్య ఉత్పత్తులు, ఆహార పానీయాల, హెర్బల్ హెయిర్ ఆయిల్ తయారీ పరిశ్రమల్లో విరివిగా ఉపయోగించవచ్చని వివరించారు. ప్రధానంగా భవిష్యత్తులో ఉద్యాన పంటల ద్వారా సహజ రంగుల పరిశ్రమలను స్థాపించుకునేందుకు... సొంతంగా సహజ రంగుల అంకురాలను స్థాపించి సుస్థిర ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చనని స్పష్టం చేశారు. హోలీ పండగకు సహజ సిద్ధమైన రంగులను తయారు చేయడానికి ఉద్యాన పంటలను ఉపయోగించుకోవచ్చన్నారు. వినాయక చవితి పండగను పురస్కరించుకని గణపతి ప్రతిమలను సహజ రంగులతో తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. రసాయన రంగుల ద్వారా పర్యావరణానికి తద్వారా మానవ మనుగడకు ఎంతో హాని జరుగుతుందన్నారు. మోదుగ, శంకు, బంతి, డాలియా వంటి పూలతో, దానిమ్మ, అరటి తొక్కలు, వేప, పీచ్, హెన్న టేకు వంటి చెట్ల బెరడుతో కూడా పర్యావరణ అనుకులమైన ఉత్పత్తులను సహజ రంగులను తయారు చేసుకోవచ్చని వివరించారు. సహజ రంగుల పునరుద్ధరణ అంశంపై ప్రధాన వక్త డాక్టర్ శారదా దేవి మాట్లాడుతూ... ప్రకృతి మనకు ఎన్నో సహజ సిద్ధమైన వనరులను అందించిందని వాటిని సద్వినియోగం చేసుకుంటే పర్యావరణహితంగా రంగులను తయారు చేసుకోవన్నారు. అనంతరం ప్రధాన వక్తలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భగవాన్, చీనా నాయక్, విజయ ఖాదర్, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం.. ప్రయాణం ప్రాణాంతకం..!

- భారీ వర్షాలు.. అసంపూర్తి పనులు
- వాహనదారుల ఆందోళన
- అధికారుల నిర్లక్ష్యంపై నిరసన వెల్లువ



కేబీ దొడ్డి–రాయన్నగూడ రోడ్డు దుస్థితి

శంషాబాద్ రూరల్: కిలోమీటరు దూరం ప్రయాణానికి పది నిమిషాల సమయం.. ఏమాత్రం అజాగ్రతగా నడిపినా రోడ్డు పక్కన కూరుకుపోతున్న వాహనాలు.. భారీ వర్షాలతో రోడ్లన్నీ ఛిద్రమై.. అసంపూర్తి ర హదారుల్లో అడుగుకోగుంత కారణంగా వాహనదారులు నడ్డి విరుగుతోంది.. మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. శంషాబాద్–షాబాద్ రహదారిలో భారీ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుపై గుంతల్లో వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జూకల్–కాచారం రహదారి పనులు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో భారీ గుంతలు వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. శంషాబాద్–మొయినాబాద్ మండలాలను అనుసంధానం చేసే రహదారి కేబీ.దొడ్డి–రాయన్నగూడ మార్గంలో విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మట్టి రోడ్డుతో పాటు భారీ గుంతలతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోజూ ఈ రహదారిపై నిమిషానికి పది వాహనాలు తిరుగుతుంటాయి. కేబీ దొడ్డి–సుల్తాన్‌పల్లి దారిలో వరదనీటి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోగా.. వాహనాలన్నీ రాయన్నగూడ చౌరస్తా మీదుగా వెళ్తున్నాయి. దీంతో ఈ మార్గంలో రద్దీ పెరిగిపోవడం.. రహదారి అధ్వానంగా ఉండడంతో వాహనదారుల వెతలు వర్ణనాతీతంగా మారాయి. ఈ మార్గంలో విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు ఇటీవల ఆందోళన సైతం చేపట్టారు.



కాచారం బస్టాప్ వద్ద రహదారిలోని గుంతలో నిలిచిన వరద నీరు



శంషాబాద్–షాబాద్ రహదారిలో గుంత



కాచారం–జూకల్ దారి...